## క్లుప్తంగా

### పీఓ ఆదేశాలు బేఖాతరు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లలో నిర్దేశించిన ధరలనే వసూలు చేయాలని పీఓ నుంచి ఆదేశాలున్నా కొందరు నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. గత జూన్‌లో ఐటీడీఏ పీఓ రాహుల్ ఏఏ పరీక్షలకు ఎంతెంత ధర వసూలు చేయాలని ఓ పట్టికను విడుదల చేశారు. ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు పాత రేట్లను తొలగించి, సూచించిన కొత్త ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, ఆ ప్రకారం మాత్రమే వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇది జరిగి మూడు నెలలు కావొస్తున్నా.. పట్టణంలోని మూడు పెద్ద ప్రైవేట్ ఆస్పత్రులు, మరో రెండు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ల నిర్వాహకులు తమ పాత ధరల ప్రకారమే వసూలు చేస్తున్నారు. పేదల వద్ద అవసరం లేని రక్త పరీక్షలు చేసి అధిక మొత్తంలో దండుకుంటున్నారు. పైగా రేట్ల పట్టికను మార్చాలంటూ వారు ఐటీడీఏ పీఓ రాహుల్‌తో పాటు, తనిఖీలు చేస్తున్న భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చైతన్యపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు, ఇదే విషయంపై గతంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వద్ద చర్చించినట్లుగా సమాచారం.

### క్రీడా పోటీల్లో రాణించాలి

**అశ్వారావుపేటరూరల్:** విద్యార్థులు విద్యతోపాటు క్రీడా పోటీల్లో కుడా రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలని అశ్వారావుపేట మున్సిపాలిటీ కమిషనర్ బానోతు నాగరాజు సూచించారు. బుధవారం స్థానిక గుడ్ న్యూస్ స్కూల్ నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మెరుగైన బోధనతోపాటు సౌకర్యాలను అందుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ పొన్నగంటి ప్రసాదరావు, కాంప్లెక్స్ హెచ్ఎం పి.హరిత, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

### పంట నష్టపరిహారం అందించాలి

**మణుగూరురూరల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, గోదావరి వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటలకు పత్తి ఎకరానికి రూ.50 వేలు, వరికి రూ.30 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు నూకారపు రమేష్, లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, అక్కి నర్సింహారావు, వేర్పుల సురేష్, రవి, జావిద్, శ్రీను, రామారావు నరసింహారావు, రాజ్‌కుమార్, రమణ, వెంకన్న, వెంకటేశ్వర్లు, రవిప్రసాద్, సృజన్, రంజిత్ పాల్గొన్నారు.

### ఎల్ఐసీ ఏఓఐ నూతన కమిటీ ఎన్నిక

**భద్రాచలంటౌన్:** పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో బుధవారం జరిగిన ఎల్ఐసీ ఏఓఐ 7వ మహాసభలో భద్రాచలం బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా యు.అరవింద బాబు, ఎస్.జోగారావు, గౌరవ అధ్యక్షుడిగా బండారు శరత్ బాబు, కోశాధికారి బి.లక్ష్మీనారాయణ, కార్యనిర్వహణ అధ్యక్షులుగా పి.సుధాకర్ రెడ్డి, సీహెచ్ బాల నరసింహులు, ఉపాధ్యక్షులుగా కె.రమేష్, కృష్ణ, ఎమ్.అర్జున్, శేషు కుమార్, సహాయ కార్యదర్శులుగా ప్రభాకర్ రావు, సీహెచ్ సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### అన్నదాన కార్యక్రమాలు

**అశ్వాపురం:** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో రైస్ మిల్లు రోడ్డులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని సీఐ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. అశోక్‌రెడ్డి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. సీఐని ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో చవిటిగూడెంలో అంగన్‌వాడీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత ప్రారంభించారు.

**గుండాల:** మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో ప్రతిష్ఠించిన గణనాథుడి మండపం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుక్కొవళ్లూరి వెంకటేశ్వర్లు, మానాల వెంకటేశ్వర్లు, యాసారపు సురేష్, కోడూరి శ్యాం, గుండెబోయిన లక్ష్మీనారాయణ, మానాల నారాయణ మూర్తి, మానాల ప్రభాకర్, బత్తిని సాయన్న, పిల్లి కృష్ణ, మాచర్ల వంశీ, గడ్డం సాయం, చెన్నూరి రాంబాబు, శ్రీరంగం శ్రీనివాస్, మానాల శ్రావన్, గౌరిశెట్టి శరత్, కోడూరి పాపాచారి, తొడిశెట్టి నాగరాజు, యాసారపు తిరుపతి, ప్రభాకర్ పాల్గొన్నారు.

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని వైయస్సార్ నగర్‌లో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కాలనీకి చెందిన ప్రముఖులు గోదావరి దంపతులు ఈ అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# పడకేసిన ప్లాస్టిక్ నిషేధం

- పల్లెల్లోనూ పెరిగిన వినియోగం
- కుప్పలు కుప్పలుగా వ్యర్థాలు
- అవగాహన కల్పించని అధికారులు



చర్ల బస్టాండ్ ఏరియాలో పేరుకుపోయిన వ్యర్థాలు

**చర్ల:** ప్లాస్టిక్ నిషేధం పడకేసింది. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఇష్టానుసారంగా దానిని వాడడంతో పాటు వాటి వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం, అవగాహన కల్పించకపోవడంతో ప్లాస్టిక్ వాడకం రోజు రోజుకు రెట్టింపవుతోంది.

**జోరుగా వాడకం..**

ఏజెన్సీలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. ఐదారేళ్ల క్రితం స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణదారులకు అక్కడక్కడ జరిమానాలు విధించగా నెల, రెండు నెలల పాటు కాస్తా ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గుముఖం పట్టింది. ఆపై మరలా షరా మామూలైంది. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోనూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం విచ్చలవిడిగా మారింది.

**అవగాహన లేకనే..**

ప్రజలకు అవగాహన లేకపోవడం వల్లే నానాటికీ ప్లాస్టిక్ వినియోగం అధికమవుతోంది. 120 మైక్రోన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను మరలా ప్రాసెస్ చేయడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఆ స్థాయిలోని ప్లాస్టిక్‌ను నిషేధించాయి. ఈ విషయాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. విక్రయించే వ్యాపారులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం చేయాలి. కానీ మండలంలో అటువంటివి ఏమీ కనిపించడం లేదు.

**అధికారుల చొరవతోనే ఫలితం**

స్థానికంగా ఉండే ఆయా పంచాయతీ కార్యదర్శులకు వీటిని నియంత్రించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే కొంత మేర వాడకం తగ్గే అవకాశాలుంటాయి. అదే విధంగా నిత్యం ఉన్నతాధికారులు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేయడం వంటి వాటితో కూడా పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకోవాలి**



ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాలి. అదే క్రమంలో ప్లాస్టిక్ కవర్లను విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలి. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎస్.కోటేశ్వరరావు, చర్ల

**అవగాహన కల్పిస్తాం..**



ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాణ కల్పించేందుకు చర్యలు చేపడతాం. క్షేత్ర స్థాయి నుంచి నియంత్రించేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శుల దగ్గర నుంచి మండల స్థాయి అధికారుల వరకు అందరినీ భాగస్వాములను చేసి పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపడుతాం.

– ఈదయ్య, ఎంపీడీఓ, చర్ల

# సీఎం పర్యటన నేపథ్యంలో అరెస్టులు



అశ్వారావుపేటరూరల్: పోలీస్ స్టేషన్‌కు వచ్చిన రామన్నగూడెం గిరిజనులు



ములకలపల్లి: పోలీస్ స్టేషన్‌లో వామపక్ష పార్టీల నాయకులు

**అశ్వారావుపేటరూరల్:** నియోజకవర్గంలోని చంద్రుగొండ మండలంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో రామన్నగూడెం గ్రామస్తులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. గత కొన్నేళ్లుగా గ్రామస్తులకు, అటవీ, ఎఫ్‌డీసీ అధికారుల మధ్య భూముల విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో గ్రామానికి చెందిన ఏవీఎస్పీ నాయకులు మడకం నాగేశ్వరరావుతోపాటు మరో ముగ్గురు గిరిజనులను స్థానిక ఎస్సై యయాతీ రాజు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారితోపాటు స్టేషన్ ఆవరణలో కుర్చున్నారు. అనంతరం సొంత పూచికత్తుపై అరెస్టైన వారిని పోలీసులు విడుదల చేశారు.

**వామపక్ష నాయకులు..**

**ములకలపల్లి:** చంద్రుగొండ మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వివిధ సంఘాల నాయకులపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో పలు సంఘాల నాయకురాళ్లు దుబ్బా ధనలక్ష్మి, సాయి రత్న, ప్రియాంకలతోపాటు వామపక్ష అనుబంధ సంఘాల నాయకుడు వరప్రసాద్ ఉన్నారు.

**దమ్మపేట:** మండల పరిధిలోని వామపక్ష పార్టీల నాయకులను బుధవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకుని ముందస్తుగా అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గంలో సీఎం పర్యటన జరగనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టయిన వారిలో పిట్టల అర్జున్, వీరయ్య, బసవయ్య తదితరులున్నారు.

**అరెస్టులు అనైతికం**

ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా అక్రమ అరెస్టులు చేయడం అనైతికమని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నానని సీపీఎం రాష్ట్ర నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మిడియం బాబురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబురావు మాట్లాడుతూ.. చంద్రుగొండ మండలంలో సీఎం పర్యటన నేపథ్యంలో తెల్లవారుజాము నుంచి సీపీఎం నాయకులను అరెస్టు చేయడం తగునా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారురు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, బండారు రవికుమార్, అన్నవరపు కనకయ్య, కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### సభ పోస్టర్లు ఆవిష్కరణ

**గుండాల:** ఈనెల 6న నిర్వహించనున్న తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవ్వాజి లక్ష్మీ నారాయణ 7వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంపిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వట్టం కన్న య్య, పూనెం శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు వజ్జ ఎర్రయ్య, గోవింద నర్సింహరావు, కిషన్‌రావు, జోషి, ఇర్ప బుచ్చయ్య, మహేందర్, పెనక సూర్యం తదితరులు పాల్గొన్నారు.

### కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి

**దమ్మపేట:** ప్రభుత్వ పరిధిలోని ప్రతి పాఠశాలలో విధిగా మొక్కలను పెంచి, కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని, మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌హెచ్‌వీఆర్ (స్వచ్ఛ ఇవం హరిత్ విద్యాలయం రేటింగ్) ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో మొక్కలను నాటి, సంబంధిత ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎమ్మార్పీలు రామ్‌సాగర్, సరోని కుమారి, సీసీఓపీ నాగేశ్వరరావు, సీఆర్పీ వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

# నదీ తీరంలో స్టాల్ ఏర్పాటు



స్టాల్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రోటరీ ఇన్ భద్రా అధ్యక్షుడు రాంబాబు

**భద్రాచలంఅర్బన్:** గోదావరి కరకట్ట ప్రాంతంలోని వినాయక నిమజ్జన ఘాట్ వద్ద ఐటీసీ రోటరీ ఇన్ సారపాక ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అందించేందుకు టీ, బిస్కెట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను భద్రాచలం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రోటరీ అధ్యక్షుడు రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోటరీ ఇన్ భద్రా ఆధ్వర్యంలో పాకాల దుర్గాప్రసాద్ సహాయంతో భక్తులకు, అధికారులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇన్ భద్రా సారపాక కార్యదర్శి సాయిరాం, మేనేజర్లు చంగల్‌రావు, ఇరిగేషన్ శాఖ అధికారులు మధుసూదన్, వెంకటేష్, ఐటీసీ కాంట్రాక్టర్లు మహేష్ రెడ్డి, ప్రసాద్, సుధాకర్ రెడ్డి, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

# సుంకాలు తగ్గించడం తగదు



అశ్వారావుపేటరూరల్: పత్రాలను కాల్చివేస్తున్న ఎస్‌కేఎం నాయకులు

**అశ్వారావుపేటరూరల్:** కేంద్ర ప్రభుత్వం పత్తిపై దిగుమతి సుంకాలు తగ్గించడం తగదని ఎస్‌కేఎం నాయకులు అన్నారు. బుధవారం అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో ఎస్‌కేఎం ఆధ్వర్యంలో అగ్రిమెంట్ పత్రాల జిరాక్స్‌లను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినపల్లి ప్రభాకర్, సీపీఐ జిల్లా నాయకుడు గన్నిన రామకృష్ణ మాట్లాడుతూ.. దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల ఇక్కడి రైతులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసం బుచ్చిరాజు, బాడిస లక్ష్మణరావు, గొంది లక్ష్మణరావు, కంగాల కన్నయ్య, కుమారస్వామి, చిలకారావు, విజయ్‌కాంత్, చీపూర్ల సత్యవతి, ముత్తు, జక్కుల బలరాం పాల్గొన్నారు.

**దమ్మపేట:** ముడి పత్తిపై దిగుమతి సుంకం తగ్గించొద్దని డిమాండ్ చేస్తూ.. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రం, దమ్మపేటలో ర్యాలీతో పాటుగా బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత జీఓ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. క్వింటా ముడి పత్తికి రూ.10,075ల మద్దతు ధర ప్రకటించి, పంట నష్టం వల్ల ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమర్లపూడి రాము, సుంకిపాక ధర్మ, మోరంపూడి శ్రీనివాసరావు, కుర్సం ముత్యాలరావు, రఘు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమిపూజ



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరుటౌన్:** మండలంలోని రూ.42లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవనాలకు బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తిర్లాపురం గ్రామంలో రూ.20లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ, అనంతరం కూనవరం పంచాయతీలోని వైఎస్సార్ నగర్‌లో రూ.22 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేశ్, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షుడు పి.నవీన్, గుండగాని నాగేశ్వరరావు, సంకపెల్లి రవీందర్‌రెడ్డి, రహీం పాషా, సీతయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటవీ అధికారుల దౌర్జన్యం సరికాదు



తహసీల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**బూర్గంపాడు:** మండల పరిధిలోని చెరువు సింగారం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళ తాటి కాసులమ్మ రెండు ఎకరాల పత్తి పంటను ఫారెస్ట్ అధికారులు అక్రమంగా నాశనం చేశారంటూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం తాటి కాసులమ్మకు 2007లో నాలుగు ఎకరాల పోడు భూమికి హక్కు కోసం దరఖాస్తు చేసుకోగా 2009లో జిల్లా స్థాయి కమిటీ ఆమోదంతో హక్కు పత్రం జారీ అయిందని, అయినప్పటికీ సెప్టెంబర్ 1న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రెండు ఎకరాల పత్తి మొక్కలను పీకేశారని ఆరోపించారు. ఫారెస్ట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాసులమ్మకు రూ.3లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బూర్గంపాడు పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ధర్నాలో కేవీపీఎస్ నాయకులు రాయల వెంకటేశ్వర్లు,సర్ప సత్యనారాయణ, ముత్తయ్య, సున్నం లక్ష్మయ్య, మలం రోజా, సోయం వీరస్వామి, మడకం వీరస్వామి, కనితి మాస్, కుర్స సుజాత, సున్నం లక్ష్మి, సున్నం కృష్ణ, శాంతి పాల్గొన్నారు.

### పాఠశాలలో హెల్త్ క్యాంప్

**దుమ్ముగూడెం:** పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గౌరారం బాలికల ఆశ్రమ పాఠశాలలో డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాషింగ్ గురించి వివరించారు. అనంతరం గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే చేపట్టి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిశుభ్రతపై పలు సూచలను చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మోతిరు, వార్డెన్ పూసం లక్ష్మీపతి, వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, సారిక, ఎంఎల్‌హెచ్ పి.శిరీష ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

### యూరియా కోసం ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న అఖిలపక్షం నాయకులు

**గుండాల:** రైతులకు యూరియా అందించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అఖిలపక్షం నాయకులు విమర్శించారు. ఈ మేరకు ఆళ్లపల్లి మండలంలోని చెలగట్టు వద్ద బుధవారం రోడ్డుపై యూరియా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజను ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా రైతులకు సరిపడా యూరియా అందించడం లేదని మండిపడ్డారు. అఖిలపక్షం నాయకులు కొమరం సత్యనారాయణ, సత్యనారాయణ, జి.శ్రీను, లక్ష్మయ్య, పాపారావు, నర్సింహారావు, టి.శ్రీను పాల్గొన్నారు.

### పంటలను పరిశీలించిన అధికారులు

**మణుగూరురూరల్:** మండలంలోని గుట్ట మల్లారం గ్రామంలో రైతులు సాగుచేస్తున్న కంది, పత్తి పంటలను మణుగూరు మండల వ్యవసాయశాఖ అధికారి రాహుల్‌రెడ్డి, ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావులు బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వకుండా, పంటలకు చీడపీడలు పట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట సాగులో సేంద్రీయ ఎరువులను వాడాలని, అధికారుల సూచనల మేరకు పురుగుమందులను పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు కోంద్రు మల్లేష్, కుర్సం భవాని, కోంద్రు కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్ డే

**మణుగూరురూరల్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దొడ్డి భద్రయ్య సూచించారు. బుధవారం కళాశాల ఆవరణలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్, అశ్వాపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శేషుబాబులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని పట్టుదలతో, కృషితో సాధించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాలియ, అధ్యాపకులు రమేష్‌బాబు, వీణ, రామ తిరుపతి, పి.భాస్కర్‌రావు, సాంబమూర్తి, అశోక్, శివకుమార్, నాగిరెడ్డి, శిరీష, బూర్గుల సతీష్, సోడే నవీన్, శ్రీకళ, స్రవంతి, స్నేహ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముంపు సమస్యలు తీరేనా..?

- పెద్దవాగు ఉధృతికి ఇళ్లు ధ్వంసం
- కోతకు గురవుతున్న రహదారులు
- శాశ్వత పరిష్కారానికి ఎదురుచూపులు



పెద్దవాగు ఉధృతికి ధ్వంసమైన ఇళ్లు (ఫైల్)



వరద ఉధృతికి పూర్తిగా ధ్వంసమైన ఎల్సిరెడ్డిపల్లి రహదారి

**పినపాక:** మండలంలోని వాగులు పొంగితే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. పంట పొలాలు కోతకు గురై రైతులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బయ్యారం గ్రామంలో పెద్దవాగు ఉధృతికి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాటలకు, పేపర్లకే పరిమితం అవుతున్నారు తప్ప పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు.

**కోతకు గురవుతున్న రహదారి..**

వర్షాలు వస్తున్నాయంటేనే ఎల్సిరెడ్డిపల్లి గ్రామస్తులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి సంవత్సరమూ వర్షాకాలంలో వాగు ఉధృతికి ప్రధాన రహదారి కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని రోజులపాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. రైతులు, ఆస్పత్రికి వెళ్లాల్సిన రోగులు, నిత్యవసర సరుకుల కోసం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాటు చేసినా.. అవి వాగు ఉధృతికి నిలవడం లేదు. గత ప్రభుత్వంలో అధికారులు పర్యటించి గొట్టెల గ్రామం నుంచి శాశ్వత బీటీ రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ.. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అవి అటకెక్కాయి.

**నేల కూలుతున్న గృహాలు**

పెద్దవాగు ఆనుకొని బయ్యారం సెంటర్‌లో సుమారు 18 ఇల్లు గత వరదలకు కోతకు గురై కింద ఉన్న పిల్లర్లు బయటపడ్డాయి. వరద తగ్గిన తర్వాత మట్టి, రాళ్లు పోసి పూడ్చిన వరదలకు కొంతమేర కోతకు గురవుతూనే ఉంది. గత ప్రభుత్వంలో అధికారులు పరిశీలించి వారికి వేరొక చోట ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ఇల్లు కట్టుకోలేక కోతకు గురవుతున్న ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. వర్షాకాలంలో మళ్లీ వరదలు వస్తే తమ పరిస్థితి ఏమవుతుందన్న అయోమయంలో బతుకుతున్నారు.

**నూతన రహదారి నిర్మించాలి..**



ప్రతి సంవత్సరమూ వరదల ప్రభావంతో మా గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురవుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాలు ఎక్కువయ్యి వరదలు వస్తే ఎల్సిరెడ్డిపల్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులు వెంటనే స్పందించి నూతన రహదారి నిర్మించాలి.

– జంపయ్య, స్థానికుడు

**సిద్ధంగా ఉన్నాం..**



రానున్న వర్షాకాలం నేపథ్యంలో మండలంలో పరిస్థితిని ఎదుర్కొనేందుకు పంచాయతీ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నాం. ముంపు ప్రాంతాలు, రహదారులకు మరమ్మతులు చేపడుతున్నాం. ఎల్సిరెడ్డిపల్లి గ్రామానికి ప్రధాన రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– సునీల్ కుమార్, ఎంపీడీఓ, పినపాక

**ముందస్తు ప్రణాళికలు**



వరదలకు ముంపుకు గురయ్యే రహదారులు, గ్రామాలను గుర్తించి ముందస్తు ప్రణాళికలో భాగంగా తగు చర్యలను చేపడుతున్నాం. ముంపునకు గురయ్యే ఇళ్లకు సంబంధించి పైఅధికారులతో నివేదిస్తాం. ఆ మేరకు సమస్య పరిష్కరమయ్యేందుకు కృషి చేస్తాం.

– గోపాలకృష్ణ, తహసీల్దార్, పినపాక